నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, శనివారం 14 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావును పోలీసులు అక్రమ అరెస్ట్‌ను; బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, అతడి అనుచరులు, కాంగ్రెస్ గూండాల దాడిని నిరసిస్తూ 'చలో హైదరాబాద్'కు శుక్రవారం ఉదయం బయలుదేరిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారు. సత్తుపల్లి, మధిర, వైరా పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పోలీసుల తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. తమ పార్టీ నేతలపై కాంగ్రెస్ గూండాలు అకారణంగా దాడులు చేస్తే పట్టించుకోని పోలీసులు.. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు హైదరాబాద్ వెళ్తున్న తమను ముందస్తుగా ఎందుకు అరెస్ట్ చేస్తున్నారంటూ ప్రశ్నించారు. భద్రాచలంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, కొత్తగూడెంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. బీఆర్ఎస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ గూండాలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతో తమ పార్టీ నేతలపై అకారణంగా దాడులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు.

–సత్తుపల్లి/ వైరా టౌన్/ మధిర/చింతకాని/ఇల్లెందు రూరల్/ ఎర్రుపాలెం, సెప్టెంబర్ 13

- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడిన ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు
- నిరసన తెలిపేందుకు హైదరాబాద్ వెళ్తున్న నేతల ముందస్తు అరెస్టులు
- దాడులు చేసిన వాళ్లనొదిలి.. తమను అరెస్ట్ చేయడమేంటంటూ ప్రశ్నలు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే తమ పార్టీ నేతలపై దాడులంటూ విమర్శ

ఇల్లెందులో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గూండాగిరిపై గరంగరం

సత్తుపల్లి పోలీసు స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు, చింతకాని పీఎస్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

ఉమ్మడి జిల్లాలోని వివిధ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. శుక్రవారం తెల్లవారుజామునే నేతల ఇళ్ల వద్దకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. సత్తుపల్లిలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, కౌన్సిలర్లు అద్దంకి అనిల్, చాంద్‌పాషా, గుండ్ల రాఘవేంద్రరావు, బీఆర్ఎస్ నాయకులు మేకల నరసింహారావు, నడ్డి ఆనందరావు, అబ్దుల్లా, జొన్నలగడ్డ కృష్ణ తదితరులను, మధిరలో బీఆర్ఎస్ నాయకులు మొండితోక జయాకర్, రావూరి శ్రీనివాసరావు, పల్లపోతు వెంకటేశ్వరరావు, అప్పారావు, కొండా తదితరులను, చింతకానిలో బీఆర్ఎస్ నాయకులు పెంట్యాల పుల్లయ్య, గడ్డం శ్రీనివాసరావు, గురజాల హనుమంతరావు, బొడ్డు వెంకట్రామారావు, పిన్నెల్లి శ్రీనివాస్, పొనుగోటి రత్నాకర్, పర్చగాని ఏడుకొండలు, నన్నక నర్సింహారావు, జానీమియా తదితరులను, వైరాలో బీఆర్ఎస్ నాయకులు కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, బాణాల వెంకటేశ్వర్లు, మద్దెల రవి, ఏదునూరి శ్రీనివాసరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, అప్పం సురేష్, దొంతెబోయిన గోపి, ఆదూరి ప్రేమ్‌కుమార్, వజినేపల్లి చక్రవర్తి, యండ్రాతి గోపాలరావు, కారుకొండ బోస్, తోటకూర వీరబాబు, సింగారపు నరేశ్ తదితరులను, ఎర్రుపాలెంలో బీఆర్ఎస్ నేతలు సాంబశివరావు, మస్తాన్‌వలీ, మల్లికార్జున్‌రెడ్డి, కిశోర్‌బాబు, శ్రీపాలశెట్టి తిరుపతిరావు, కత్తి రవి, షేక్ బాజీ తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

నిలదీస్తే దాడులా?: బీఆర్ఎస్

ప్రతిపక్షం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ప్రశ్నిస్తే కేసులు పెడుతోందని, నిలదీస్తే దాడులు చేయిస్తోందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడి, మాజీ మంత్రి హరీశ్‌రావు అక్రమ అరెస్టులను ఖండిస్తూ ఇల్లెందులో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిలివేరు సత్యనారాయణ మాట్లాడుతూ.. దౌర్జన్యాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకులు, బీఆర్ఎస్ భావ్‌సింగ్‌నాయక్, జేకే శ్రీనివాస్, తోట లలిత శారద, పరుచూరి వెంకటేశ్వర్లు, నెమలి ధనలక్ష్మి, కొక్కు సరిత, జబ్బార్, నభి, గిన్నారపు రాజేశ్, హరికృష్ణ, ఆదూరి రవి, హరిప్రసాద్, కావేటి రమేశ్, వాసు, కిరణ్, చాంద్‌పాషా, సురేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమపార్టీకి అరెస్టులు కొత్త కాదు

ప్రజాసామ్యయుతంగా నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అన్నారు. చింతకాని మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ పార్టీకి అరెస్టులు కొత్తకాదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీను, బొడ్డు వెంకట్రామారావు, గురజాల హనుమంతరావు, పిన్నెల్లి శ్రీను, పొనుగోటి రత్నాకర్, నన్నక నర్సింహారావు పాల్గొన్నారు.

సర్కారుది నియంత పోకడ: మెచ్చా

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 13: కాంగ్రెస్ పాలకులు నియంత పోకడ మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచించారు. లేదంటే ప్రజలు ఎక్కడికక్కడ తిరగబడతారని హెచ్చరించారు. తాటిసుబ్బన్నగూడెంలోని తన నివాసంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ గూండాల దాడులకు నిరసనగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేయడం హేయమైన చర్య అని అన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లనీయకుండా ముందస్తు అరెస్టు చేసి పీఎస్‌లకు తరలించడంతో మధిర, వైరా, ఎర్రుపాలెం మండలాల పోలీసు స్టేషన్లలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

భద్రాచలం: సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

ప్రజా పాలన అంటే దాడులా?

- మీ పాలనపై నమ్మకం ఉంటే ఎమ్మెల్యేల చేత రాజీనామా చేయించి మళ్లీ గెలవండి
- పార్టీ మారిన 'తెల్లం'.. ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలి
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 13: 'మాది ప్రజాపాలన..' అని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడమే పనిగా పెట్టుకున్నదని, ఇదంతా ఒక పథకం ప్రకారం నడుస్తున్నదని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు విమర్శించారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. భద్రాచలంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ గూండాలు వరుసగా దాడులు చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రమూ స్పందించడం లేదన్నారు. ఇటీవల మాజీ మంత్రి హరీశ్‌రావు ఇంటిపై, ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించడానికి వచ్చిన బీఆర్ఎస్ నేతలపై దాడికి దిగినా వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 'మీకు పాలనపై మీకు నమ్మకం ఉంటే.. పదిమంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ప్రజాక్షేత్రంలో మళ్లీ గెలిపించి చూపించాలి' అని డిమాండ్ చేశారు. పార్టీ మారిన తెల్లం వెంకట్రావు నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, గోడవర్తి నర్సింహమూర్తి, సాగి శ్రీనివాసరాజు, ఆకోజు సునీల్‌కుమార్, ఉడత రమేశ్, డానియేలు, ప్రదీప్, యువరాజు, ఐనాల రామకృష్ణ, ప్రకాశ్, అనిల్, నాగరాజు, రాణి, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి చిల్లర రాజకీయాలు

- బీఆర్ఎస్‌పై దాడులకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి
- ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి హేయం: మాజీ ఎమ్మెల్యే వనమా

సమావేశంలో మాట్లాడుతున్న కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 13: బీఆర్ఎస్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేయడం చేతగాక దాడుల సంస్కృతిని ప్రోత్సహిస్తోందని మండిపడ్డారు. కొత్తగూడెంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార మదం, అంగ బలంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి హత్యాయత్నానికి యత్నించడం సిగ్గుచేటని అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దాడులకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డిని పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, కౌన్సిలర్లు రక్మాంగధర్, వేల్పుల ప్రసాద్, అంబుల వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు భూక్యా సోన, కొల్లు పద్మ, బత్తుల వీరయ్య, మంతపురి రాజుగౌడ్, కొట్టి వెంకటేశ్వర్లు, సబ్బారపు నాగేందర్, కాంపెల్లి కనకేశ్, మైనార్టీ సంఘం నాయకులు అన్వర్‌పాషా, సయ్యద్ హైమద్, టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకుడు కూసన వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతే ప్రధాన లక్ష్యం

షీటీమ్స్, ఏహెచ్‌టీయూ నూతన కార్యాలయాల ప్రారంభోత్సవంలో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

షీటీమ్, ఏహెచ్‌టీయూ కార్యాలయాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

చుంచుపల్లి/ కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 13: మహిళల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. పట్టణంలోని పాత చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ భవనంలోకి మార్చిన షీటీమ్స్, ఏహెచ్‌టీయూ కార్యాలయాలను ఎస్పీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం రాష్ట్ర పోలీస్ శాఖ తరపున టీజీడబ్ల్యూఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగమే షీటీమ్స్ అని అన్నారు. లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, బ్లాక్ మెయిలింగ్ తదితర ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలు జిల్లా షీటీమ్స్‌ను నేరుగా సంప్రదించవచ్చన్నారు. జిల్లా షీటీమ్స్ నంబర్ 8712682131కు ఫోన్ చేసి తమ సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. అదనపు ఎస్పీ పరితోష్ పంకజ్, డీఎస్పీ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, 2టౌన్ సీఐ రమేశ్, సైబర్ క్రైమ్స్‌సీఐ జితేందర్, ఆర్ఐలు సుధాకర్, రవి, లాల్‌బాబు, కృష్ణారావు, షీటీమ్స్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, ఆర్ఎస్సై రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విలువైన రికార్డులు వరదపాలు

- తడిచిముద్దయిన కీలకమైన ఫైళ్లు, కంప్యూటర్లు, రికార్డులు
- నీట మునిగిన ఎంపీడీవో, ఐకేపీ, ఎంఈవో ఆఫీసులు
- నిరుటి వరదల్లోనూ మునిగిన ప్రభుత్వ కార్యాలయాలు

ఖమ్మం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో ఆరబెట్టిన రికార్డులు

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 13: పదిహేను రోజుల క్రితం ఉప్పొంగిన మున్నేరు ఖమ్మం రూరల్ మండలంలోని అనేక గ్రామాలను ముంచెత్తింది. దీంతో దాని పరీవాహక ప్రజలు కట్టుబట్టలతో ఇళ్లలోంచి బయటికెళ్లారు. అయితే సాధారణ ప్రజల ఇళ్లతోపాటు అనేక ప్రభుత్వ కార్యాలయాలు కూడా మునిగిపోయాయి. దీంతో వాటిల్లోని విలువైన రికార్డులు నీటిలో తడిచి ముద్దయ్యాయి. ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ, ఈజీఎస్ కార్యాలయాల్లోని గదుల్లోకి రెండు అడుగుల మేర వరద వచ్చింది. దీంతో రికార్డులున్నీ వరద నీటిపాలయ్యాయి. దీంతో తడిచిన రికార్డులను, విలువైన పత్రాలను, ఫైళ్లను ఆయా కార్యాలయాల అధికారులు శుభ్రపరుస్తున్నారు. కొన్నింటిని విడదీసి ఆరబెడుతున్నారు. ఇంకొన్ని పత్రాలు పూర్తిగా తడిచి పనికిరాకుండా పోయాయి. నిరుటి వరదల్లో కూడా ఐకేపీ, ఈజీఎస్, ఎంఈవో కార్యాలయాలు నీటమునిగిన విషయం విదితమే. ఈ ఏడాది ఐకేపీ కార్యాలయంలో కంప్యూటర్లు, కుట్టు మిషన్లు సహా ఇతర అనేక వస్తువులు పూర్తి పాడయ్యాయి. సుమారు రూ.12 లక్షల పైగానే నష్టం వాటిల్లినట్లు అధికాకారులు అంచనా వేశారు. వీటితోకి తోడు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల యూనిఫామ్స్, క్లాత్‌లతోపాటు ఈజీఎస్ కార్యాలయంలోని ఫర్నిచర్, కంప్యూటర్లు, ఎంఈవో ఆఫీసులోని కంప్యూటర్, కీలక ఫైళ్లు తడిచిపోయాయి.




సమరానికి సమాయత్తం!

- డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేసిన జిల్లా అధికారులు
- పంచాయతీ, మండల పరిషత్ గోడలపై ప్రదర్శన
- 28న ఓటర్ల తుది జాబితా

లక్ష్మీదేవిపల్లిలో ముసాయిదా ఓటర్ల జాబితాను కార్యాలయ ద్వారానికి తగిలిస్తున్న సిబ్బంది

కొత్తగూడెం, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : గ్రామపంచాయతీ ఎన్నికల కోసం జిల్లా అధికారులు ముసాయిదాను సిద్ధం చేశారు. డీపీవో రాజమౌళి ఆధ్వర్యంలో ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను అధికారులు పంచాయతీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో గోడలపై శుక్రవారం ప్రదర్శించారు. ఈ నెల 14 నుంచి 21 వరకు అభ్యంతరాల స్వీకరణ, 26న అభ్యంతరాల పరిశీలన తర్వాత తుది జాబితాను రూపొందించి.. 28న ఫైనల్ పబ్లికేషన్ విడుదల చేయనున్నారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో కార్యదర్శుల వద్ద ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచారు.

అందుబాటు డ్రాఫ్ట్ నోటిఫికేషన్..

నూతన పంచాయతీరాజ్ చట్టం ద్వారా జిల్లాలో అదనంగా కొత్త గ్రామపంచాయతీలు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే గత పంచాయతీ ఎన్నికలు నిర్వహించారు. తర్వాత భద్రాచలం, సారపాక పంచాయతీలను అదనంగా ఐదు పంచాయతీలుగా చేసిన విషయం విదితమే. అయితే ఎన్నికల నిర్వహణకు ఇప్పటి వరకు అనుమతి రాలేదు. అయినా వాటితో కలిపి పంచాయతీ అధికారులు వార్డుల విభజన చేశారు. 484 పంచాయతీలకు.. 4,314 వార్డులుగా విభజించారు. రాబోయే ఎన్నికలు భద్రాచలం, సారపాకలో పెరిగిన పంచాయతీలకు కూడా నిర్వహించనున్నారు.

జిల్లాలో 6,82,858 మంది ఓటర్లు

గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రూపొందించిన ఓటర్ల జాబితా ఆధారంగా పంచాయతీలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారు చేశారు. జిల్లాలో 22 మండలాలకు 484 పంచాయతీల్లో 4,314 వార్డులలో 6,82,858 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇందులో మహిళలు 3,49,893, పురుషులు 3,32,940 మంది, ఇతరులు 25 మంది ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ఏర్పాట్లు కట్టుదిట్టం

వినాయక నిమజ్జన ఏర్పాట్లపై నిర్వహించి సమీక్షలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, చిత్రంలో సీపీ సునీల్‌దత్

- క్రేన్లు, పడవలను సిద్ధంగా ఉంచాలి
- ప్రణాళికతో ట్రాఫిక్ నియంత్రణ
- 17న ప్రజాపాలన దినోత్సవం
- ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 13 : జిల్లాలో గణేశ్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేందుకు సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, మధుసూదన్‌నాయక్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడూతూ జిల్లాలో ఈ నెల 16వ తేదీ సోమవారం వినాయక నిమజ్జనాలు అధికంగా జరుగుతాయని, మంగళవారం కూడా విగ్రహాల నిమజ్జనం కొనసాగుతుందని దీనికోసం అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిమజ్జన స్థలాల వద్ద క్రేన్లు, పడవలు, విద్యుత్‌దీపాలు, గజ ఈతగాళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక వైద్యశిబిరాలను అందుబాటులో ఉంచాలన్నారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ 16వ తేదీన వెయ్యికి పైన, 17వ తేదీన 800 విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉందన్నారు. ట్రాఫిక్ ప్రణాళికలతోపాటు నిమజ్జన ప్రదేశంలో అన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డీఆర్‌వో రాజేశ్వరి, వివిధశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దినోత్సవానికి ఏర్పాట్లు

ఈ నెల 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకలను జిల్లాలో ఘనంగా, పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆ రోజున ఉదయం 10 గంటలకు ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరై గౌరవవందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తమ సందేశాన్ని అందజేస్తారని, అనంతరం స్టాల్స్ సందర్శన ఉంటుందని తెలిపారు. అభయ హస్తం గ్యారెంటీ పథకాల అమలుకు సంబంధించి స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ఈ వేడుకలకు జిల్లా అధికారులు తప్పకుండా హాజరుకావాలన్నారు. ప్రతి జిల్లా అధికారి కార్యాలయంతోపాటు గ్రామ పంచాయతీ, మండల స్థాయి, మున్సిపాల్టీల్లో వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు.

అధికారుల పనితీరు ప్రశంసనీయం..

సెప్టెంబర్ 1 నుంచి 5వ తేదీ వరదల సమయంలో ప్రజలను ఆదుకునేందుకు, సేవలు చేసేందుకు అధికారులు చేసిన పని తీరు ప్రశంసనీయమన్నారు. ఎంతో ఓపికతో సహాయక చర్యలు చేపట్టారని, విలువైన సేవలు అందించారని అభినందించారు.